తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక వార్త





## తమ్ముడ్ని చంపిన అన్న



హత్యకు గురైన ప్రతాప్

చిల్లకూరు సెప్టెంబర్ 11 ప్రభాతవార్త

మండలంలోని కాకువారిపాలెం గ్రామ పంచాయితీలో శనివారం అర్ధరాత్రి అద్దెపల్లి ప్రతాప్ (23)ని అతని అన్న అద్దెపల్లి బాలాజీ అతి దారుణంగా కొట్టి చంపాడు. పోలీసుల కథనం మేరకు అదెపల్లి ప్రతాప్ భార్య ఇటీవల కరోనాతో మృతి చెందింది.అయితే అప్పటి నుండి అన్న బాలాజీ ఇంటి వద్ద ప్రతాప్, అతని కుమార్తె జీవనం సాగిస్తున్నారు. శనివారం రాత్రి అన్న బాలాజీ భార్యతో ప్రతాప్ వివాహేతర సంబంధం పెట్టుకొని ఇద్దరు ఒకే ఇంట్లో ఉండగా అది చూసిన బాలాజి తమ్ముడు ప్రతాప్‌ని అతిదారుణంగా కొట్టి చంపాడని చిల్లకూరు ఎస్ఐ బి గోపాల్ తెలిపారు. ఎస్ఐ సిబ్బందితో కలిసి ఆదివారం ఉదయం సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు పరారిలో ఉన్నట్లు తెలిపారు.

## అమ్మవారి ఆలయానికి స్వర్ణ పాదాలు కానుక!

తిరుచానూరు,సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:



తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారి ఆలయానికి ఆదివారం హైదరాబాద్‌కు చెందిన సత్యనారాయణ అనే భక్తుడు స్వర్ణ పాదాలను కానుకగా అందచేశారు. ఆలయంలో జరిగే కళ్యాణోత్సవంలో శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఉత్సవ మూర్తికి అలంకరించేందుకు ఈ పాదాలను సమర్పించారు. 85 గ్రాముల బరువు గల ఈ పాదాల విలువ 4 లక్షల రూ॥లని భక్తుడు తెలిపారు. ఈ స్వర్ణ పాదాలను ఆలయంలోని అధికారులు ఏఈఓ ప్రభాకర్‌రెడ్డి, సూపరింటెండెంట్ శేషగిరి, అర్చకులు బాబు స్వామిలకు భక్తుడు సత్యనారాయణ అందచేశారు.

## రావణబ్రహ్మ వాహనంపై
# పార్వతీపుత్రుడు విహారం



కాణిపాకం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:

కాణిపాకం దేవస్దానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి ఉభయదేవేరులతో పార్వతీపుత్రుడు రావణబ్రహ్మ వాహనంపై కాణిపాకం పురవీధుల్లో అలరిస్తూ భక్తులకు అభయహస్తమిచ్చాడు. ఆలయంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాల ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు స్వామివారికి రావణబ్రహ్మ వాహనసేవను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి పుణ్యసముద్రం, లక్ష్మాంబపురం, సంతపల్లె, ద్వారకాపురం, కురప్పల్లె, సిద్దంపల్లె గ్రామస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. వీరు ఉదయం వరుస ఉభయం తీసుకురాగా అర్చకస్వాములు స్వామివారి మూలవిరాట్‌కు వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ ప్రత్యేక అభిషేకాలను, పూజలను నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే రాత్రి సిద్ధి, బుద్ధి సమేతుడైన గణనాథుని ఉత్సవమూర్తులను అన్వేటి మండపంలో వుంచి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ధూపదీపనైవేద్యాలను సమర్పించారు. అనంతరం రంగురంగుల విద్యుద్దీపాలు, వివిధ రకాల పరిమళ పుష్పాలతో శోభాయమానంగా అలంకరించిన రావణబ్రహ్మ వాహనంపై ఉభయదేవేరులతో స్వామివారు అధిరోహించి మంగళవాయిద్యాల నడుమ కాణిపాకం గ్రామ పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయహస్తం అందించారు. ఈసందర్భంగా భక్తులు నారికేళ సమర్పణలతో మొక్కులను తీర్చుకున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎంవి.సురేష్‌బాబు, ఈఈ వెంకట నారాయణ, ఏసీ కస్తూరి, ఏఈఓలు విద్యాసాగర్‌రెడ్డి, రవీంద్రబాబు, హేమమాలిని, హరిమాధవరెడ్డి, సూపరెండెం ట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, శ్రీనివాస్, టెంపుల్ ఇన్స్ పెక్టర్‌లు బాబు, రమేష్, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డిలతో పాటు ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.



## అలిపిరి-జూపార్కు మార్గంలో
# నక్షత్రాల హోటల్లొస్తే ప్రమాదకరమేనా!?
### ప్రతిపాదనలకు ముందే వ్యతిరేకత!!



ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:

పవిత్రపుణ్యక్షేత్రం తిరుమలకు దేశవిదేశాల నుంచి ప్రతిరోజూ వస్తున్న లక్షమంది వరకు భక్తులకు వసతి కల్పించే విషయంగా ధార్మిక సంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం తీసుకుంటున్న ప్రతిపాదనలు మంచివేనా? అలిపిరి-జూపార్కుమార్గంలో నక్షత్ర హోటళ్ళు నిర్మిస్తే ప్రమాదకరమేనా??అనే అనుమానాలు, ప్రశ్నలు ప్రజాసంఘాలు, శ్రీవారి భక్తుల్లో వ్యక్తమవుతూన్నాయి. తిరుపతి నగరం స్మార్ట్‌సిటీగానేగాక అంతర్జాతీయంగా ఖ్యాతిచెందడంతో టిటిడి సహకారంతో అలిపిరి-జూపార్కు మార్గంలో ఇప్పటికే ఎస్వీఅరవిందో నేత్రవైద్యశాల, టాటా క్యాన్సర్ ఆస్పత్రి, పర్యాటకరంగం కార్యాలయాలు తదితరాలు అందుబాటులోకి వచ్చాయి. అంతేగాక ఎస్వీవేదవిశ్వవిద్యాలయం, ఎస్వీ పశువైద్యవిశ్వవిద్యాలయాలకు ఈ జూపార్కుమార్గం మరింత సౌలభ్యంగా ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఈ మార్గంలో ఉన్న టిటిడి స్థలాల్లో యాత్రికులకు వసతి కల్పించేందుకు తిరుపతి అలిపిరి-జూపార్కు మార్గంలో ఐదు,ఏడు నక్షత్రాల హోటళ్ళు నిర్మించాలనే ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. సోమవారం తిరుమలలో జరగనున్న టిటిడి పాలకమండలి సమావేశంలో కూడా ఈ అంశంపై చర్చకు రానున్నట్లు తెలుస్తోంది.

దీంతో జూపార్కుమార్గంలో ఈ నక్షత్రాల హోటళ్ళు రావడం వల్ల అటు తిరుమలకు ఇటు తిరుపతికి భద్రత ప్రమాదకరంగా వుంటుందనే భిన్నాభిప్రాయాలు తెరపైకి వస్తున్నాయి. ఇదే విషయంగా రాయలసీమ పోరాట సమితి కన్వీనర్ ,శ్రీవారిభక్తుడు పి.నవీన్‌కుమార్‌రెడ్డి తన అభిప్రాయాన్ని టిటిడి పాలకమండలికి, ప్రభుత్వానికి మీడియాద్వారా తెలిపారు. తిరుమలకు వచ్చే భక్తులు, తిరుపతికి పలు పనులనిమిత్తం వస్తున్న యాత్రికుల సంఖ్య రెట్టింపవుతోంది. పైగా జూపార్కుమార్గంలో ఆస్పత్రులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడకు వచ్చే వారితోబాటు తిరుమల భక్తులకు వసతి కల్పించేందుకు టిటిడి సొంతంగా స్టార్ హోటళ్ళు నిర్మించే ప్రతిపాదనలకు తెరపైకి తీసుకువస్తోంది. దీనివల్ల భద్రతకు భంగం వాటిల్లుతుందనేది వాదన, మరి సోమవారం టిటిడి పాలకమండలి ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాల్సిందే.

## నేడు టిటిడి పాలకమండలి సమావేశం




తిరుమల,సెప్టెంబర్ 11 ప్రభాతవార్తప్రతినిధి:

టిటిడి పాలకమండలి సమావేశం సోమవారం ఉదయం 10గంటలకు అన్నమయ్యభవనంలో జరుగుతుంది. ఈ ఏడాది సాలకట్ల బ్రహ్మోత్సవాలను భక్తుల మధ్య ఆలయ మాఢవీధుల్లో జరుపుతుండటం, భక్తులు అశేషంగా తరలివచ్చే అవకాశం ఉన్నందున అదనపు సౌకర్యాలు, పలు అభివృద్ధి పనులు, అన్నమయ్యమార్గం నిర్మాణం, భక్తులకు పిఎసి 5 నిర్మాణం, ముంబైలో శ్రీవారి ఆలయం నిర్మాణం తోబాటు ఉద్యోగులకు బ్రహ్మోత్సవాల బహుమానం తదితర అంశాలపై చర్చించనున్నారు. 27న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తిరుమలకు వస్తుండటంతో ఆయన కార్యక్రమంపై కూడా చర్చించనున్నారు. ఈ పాలకమండలి సమావేశంలో ప్రధానంగా భక్తులకు వసతి కల్పన, అభివృద్ధి పనులు, మార్కెటింగ్ కొనుగోళ్ళుపై చర్చకు రానున్నాయి. తిరుమలకు ఆర్టీసి విద్యుత్ బస్సుల అంశంపై కూడా చర్చించనున్నారు.

## ఆస్పత్రిలో రోగి
# అనుమానాస్పద మృతి

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో ఆదివారం అర్ధరాత్రి ఓరోగి అనుమానాస్పద స్థితిలో మృత్యువాత పడ్డాడు. శ్రీకాళహస్తి గాండ్లవీధికి చెందిన గోపాల్‌కుమారుడు మహేష్(27) శనివారం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో చేరాడు. అతను మూర్ఛరోగి అని చెబుతున్నారు. అయితే ఆదివారం అర్ధరాత్రి మహేష్ ఆస్పత్రి పైభాగంలో నిర్మిస్తున్న కొత్తకట్టడంపై నుంచి కిందపడి మృతిచెందినట్లు పట్టణంలో దావానంలా చర్చించుకుంటున్నారు. అయితే ఆస్పత్రి వర్గాలు మాత్రం అతను బయటకు వెళ్ళి కిందపడి మృతిచెందినట్లు చెబుతున్నారు. అయితే వాస్తవాలేమిటో పూర్తిగా తెలియరాలేదు.వాస్తవాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. అయితే ఆస్పత్రిలో రోగి అర్ధరాత్రి మృతిచెందడం కలకలం సృష్టించింది.



## 26 నుండి అమ్మవారి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు 4లో

## ఘనంగా పోలేరమ్మ ఘటోత్సవం ...



వెంకటగిరి సెప్టంబరు11 ప్రభాతవార్త ;

వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ ఘటోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది.కాంపాలెం నుండి ఘటోత్వని ఊరేగింపుగా తీసుకొచ్చి జీను గలవారి వీదిలోని అమ్మవారి అలంకార మండపంలో ఉంచి పూజలు నిర్వహించారు.అక్కడ నుండి పోలేరమ్మ గుడివద్ద పూజలు నిర్వహించారు.భక్తులు ఘటోత్వన్ని తిలకించి దండం పెట్టుకున్నారు.ఘటోత్సవంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండ పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

## శ్రీకాళహస్తిలో తరచూ విద్యుత్ కోతలు!
### ఇబ్బంది పడుతున్న భక్తులు, వినియోగదారులు

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త


శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం.గతంలో విద్యుత్ కోతల నుంచి ఈ దివ్యక్షేత్రాన్ని మినహాయించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నంత కాలం ఈ నిబంధన అమలు జరిగేది. అయితే గత కొంత కాలంగా ఈ నిబంధనలకు విద్యుత్‌శాఖ అధికారులు తూట్లు పొడిచారు. శ్రీకాళహస్తీశ్వరాలయం, నాలుగుమాడావీధులకు సంబంధించి విద్యుత్ సరఫరాలో అంతరాయం కల్గకుండా తెలుగుదేశం హాయాంలోనే ప్రత్యేక సబ్‌స్టేషన్‌ను లోబావిలో ఏర్పాటు చేసారు. రెండు నెలలు ముందు వరకు ఇక్కడ పని చేసిన ఎఇఇ విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ముందు జాగ్రత్తలు తీసుకునే వారు. ఇటీవల జరిగిన బదిలీలతో కొత్త ఎఇఇలు వచ్చారు. అప్పటి నుంచి లోబావి సబ్‌స్టేషన్ పరిధిలోని వినియోగదారులకు కష్టాలు మొదలయ్యాయి. అయితే ఇక్కడ బాధ్యత వహించే ఎఇఇ మాత్రం తమకేమి సంబంధం లేదని చేతులు దులుపుకుంటున్నారు. ఆదివారం సాయంత్రం కూడా పలుమార్లు విద్యుత్ సరఫరాలో అంతరాయం కల్గింది. ఈ ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే ఆలయంలోని భక్తులకు కూడా ఇబ్బంది కల్గుతుంది. ఆలయంలోని జనరేటర్ ఎప్పుడు పని చేస్తుందో ఎప్పుడు చేతులెత్తేస్తుందో అంతు పట్టడం లేదు. ఈ సబ్‌స్టేషన్ పరిధిలోనే దూర ప్రాంతాలనుంచి వచ్చే భక్తులు బస చేసే అతిధి గృహాలు, దేవస్థానం అతిధి గృహాలున్నాయి. శ్రీకాళహస్తిలోని నాలుగుమాడావీధుల్లో లాడ్జిల్లోవేటికి జనరేటర్లు లేదు. ఒక వేళ ఉన్నా వారు ఆన్ చేయరు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గితే ఇక గదుల్లో ఉన్న భక్తులకు చుక్కలు కనబడుతున్నాయి. ఇక హోటళ్ళు,ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, వ్యాపారులు,నివాశస్థుల పరిస్థితి ఆగమ్య గోచరంగామారింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుతం విద్యుత్ సరఫరా మారింది.ఒకసారి అంతరాయంఏర్పడితే గంట నుంచి అర్ధగంట ఉంటుంది.అయితే విద్యుత్ శాఖ అధికారులుమాత్రం ఏ ఐదో ఆరో నిముషాలుమాత్రమే అంతరాయంకల్గినట్లు నమోదు చేసుకుంటూ ఉన్నతాధికారులను తప్పుదారి పట్టిస్తున్నారు.

### ఉష్ణోగ్రతలు
10/9/2022



- తిరుపతి 30 డిగ్రీలు
- చిత్తూరు 32 డిగ్రీలు
- మదనపల్లి 25 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 32 డిగ్రీలు
- వెంకటగిరి 32 డిగ్రీలు
- గూడూరు 32 డిగ్రీలు

### బంగారం ధరలు
10/9/2022



22 క్యారెట్స్ 1గ్రాము రూ. 4,740

24క్యారెట్స్ 1గ్రాము రూ.5,171

### కోడిగ్రుడ్ల ధరలు
10/9/2022



కోడిగ్రుడ్డు :రూ.5.00


1 డజను: రూ.60.00

# పట్టాలపై పరుగులు పెట్టనున్న రైళ్లు

- -రైళ్ల సర్వీసుల వేగం ఇకపై గంటలకు 130 కిలోమీటర్లు
- -గూడూరు-విజయవాడ మధ్య తగ్గనున్న ప్రయాణ సమయం
- -రేణిగుంట-గుంతకల్లు మధ్య కూడా ప్రయాణం సుగమం

గూడూరు,సెప్టెంబరు 11 ప్రభాతవార్త

దక్షణ మధ్య రైల్వే జోన్ పరిధిలో ఇకపై రైళ్ల వేగం గంటలకు 130 కిలోమీటర్లు కానుంది. ఈమేరకు ఆదివారం దక్షిణ మధ్య రైల్వే ప్రధాన ప్రజాసంబంధాల అధికారి సిహెచ్.రాకేష్ ప్రకటన విడుదల చేశారు. రైళ్ల ప్రయాణానికి అనుగుణంగా రైలు పట్టాలను పటిష్టం చేసి రైళ్ల రాకపోకలకు అనుకూలంగా ఉంచినట్లు రైల్వేశాఖ తెలిపింది. సికింద్రాబాద్- విజయవాడ, గూడూరు-విజయవాడ, రేణిగుంట-గుంతకల్ మధ్య ప్రణాళిక బద్దంగా వేగంగా రైళ్లు నడిచేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. కోవిడ్ సమయంలో రైల్వేశాఖ కీలక సెక్షన్లను ఆధునీకరిస్తూ నిర్ణయం తీసుకుంది. ఆదిశగా అడుగులు వేసి రైలు పట్టాలను పటిష్టం చేసి, సిగ్నలింగ్ వ్యవస్థను గతంకంటే మెరుగు పరిచింది. అంతేగాకుండా రైల్వేక్రాసింగ్‌ల వద్ద బ్రిడ్జిలను ఏర్పాటు చేసి అండర్‌గ్రౌండ్‌లో రాకపోకలు సాగించేలా ఏర్పాట్లు చేయడం జరిగింది. 2020 నుంచి జరుగుతున్న పనులు ఎట్టకేలకు పూర్తయినట్లు రైల్వేశాఖ ప్రకటించింది. గతంలో గంటకు అత్యధికంగా 110కిలోమీటర్లు రైలు ప్రయాణించే అవకాశం ఉండేది అయినప్పటికి 100కిలో మీటర్లకు మించి పట్టాలపై రైళ్లరాకపోకలు సాగేవి కావు. తాజాగా 110కిలో మీటర్ల వేగం నుంచి గంటలకు 130 కిలో మీటర్ల వేగం సెప్టెంబర్ 12నుంచి అనుమతిస్తున్నారు. ఈవేగం అప్ అండ్ డౌన్ లైన్లలో వెళ్లేందుకు అవకాశం ఉంది. గూడూరు-విజయవాడ డివిజన్, రేణిగుంట-గుంతకల్ డివిజన్లలో రైళ్లు 130 కిలోమీటర్ల వేగంతో పరుగులు పెట్టనున్నాయి. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఉన్న ఈమార్గాలను గోల్డెన్ రూట్స్‌గా పరిగణిస్తారు. దీని అనుగుణంగా లోకోపైలట్లు రైళ్లను నడుపుతారు. ప్రయాణికులు ప్రయాణించే సూపర్‌ఫాస్ట్, ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ శ్రేణీ రైళ్లతో పాటు గూడ్సు రైళ్లకు వేగంగా వెళ్లేందుకు అనుమతి ఇస్తారు. ప్రత్యేక వాహనాలకు పరిస్థితులకు అనుగుణంగా వేగనియంత్రణ ఉంటుందని రైల్వే అధికారులు వెల్లడిస్తున్నారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో రైళ్ల వ్యవస్థను పటిష్టం చేసేందుకు కృషి చేసిన రైల్వే అధికారులు, సిబ్బందిని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ అభినందించారు. రైళ్ల వేగం పెరిగితే ప్రయాణికులు అనుకున్న సమయానికి గమ్యస్థానాలకు చేరే అవకాశం రైల్వే ద్వారా ఏర్పడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. రేణిగుంట-గుంతకల్ మార్గాల్లో ఆధునీకరించిన వేగం వల్ల దక్షిణ-ఉత్తర భారతదేశాల మధ్య ప్రయాణించేందుకు సమయం ఆదా అవతుంది. ముఖ్యంగా ముంబయి నుంచి బెంగుళూరు, కేరళ, తమిళనాడుకు వెళ్లేందుకు సమయం ఆదాకానుంది. గూడూరు-విజయవాడ మధ్య వేగం రైళ్ల వేగం పెరగడం మూలంగా కలకత్తా-చెన్నై, తిరుపతి-విజయవాడ మధ్య రైళ్ల వేగం పెరగనుంది. రైలు పట్టాలను పటిష్ట పరిచిన తరువాత జిపియస్ అనుసంధానించి పరీక్షలను సైతం విజయంతంగా నిర్వహించి ఫలితాలు అనుకూలంగా రావడంతో రైళ్ల వేగాన్ని పెంచుతూ రైల్వేశాఖ నిర్ణయం తీసుకుంది. ఇది ఇలా ఉంటే గూడూరు-విజయవాడ మధ్య మూడో రైల్వే లైను అపనులు జరుగుతున్నాయి. ఈమార్గం పూర్తయితే రైల్వేశాఖలో కొత్త అధ్యాయం లిఖించినట్లవుతోంది. బ్రిటీషు కాలం నుంచి ఉన్న రైళ్లమార్గాలతో పాటు కొత్తరైలు మార్గం అందుబాటులోకి వచ్చి సరుకురవాణ, ప్రయాణికుల ప్రయాణానికి అనువు కానుంది.



ఆధునీకరించిన రైల్వే లైను

## కాణిపాకంలో నేడు
(సోమవారం)

పగలు : అభిషేకం
రాత్రి : యాళివాహనసేవ

ఉభయదారులు : శ్రీ ఎ.నరసింహారెడ్డి అండ్ సన్, అగరంపల్లె, శ్రీపి.సుబ్బారెడ్డి అండ్ సన్స్, చినకాంపల్లె, దేవస్థానం వారిచే.

స్థానిక ఆస్థాన మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు: ఉదయం 9 గంటల నుండి 10 గంటల వరకు కె.సునీల్ కుమార్, శ్రీకాళహస్తి, 10 గంటల నుండి 11 గంటల వరకు యశోదమ్మ, తిరుపతి, 11 గంటల నుండి 12 గంటల వరకు కె.రమాదేవి, తిరుపతి, 12 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు బి.మునిరామయ్య, పేరూరు, 1 గంటల నుండి 2 గంటల వరకు జి.సురేంద్ర, తిరుపతి, డి.సుగుణమ్మ, జె.మోహన్, చిత్తూరు వారిచే భక్తిగీతాలు, సాయంత్రం 4 గంటల నుండి 5 గంటల వరకు కె.రూపచందన, శ్రీకాళహస్తి వారచే భరతనాట్యం, 5 గంటల నుండి 6 గంటల వరకు ఎన్.విజయశాంతి, కడప వారిచే కూచిపూడి, 6 గంటల నుండి 7 గంటల వరకు డి.రాధిక నృత్యాలయ కూచిపూడి ఆర్ట్స్ ఆకాడమి, అనంతపురం వారిచే కూచిపూడి, రాత్రి 7 గంటల నుండి 8గంటల వరకు .ఎ.రామచంద్ర మోహన్, శ్రీనృత్య కళాంజలి, విజయవాడ, 8 గంటల నుండి 9 గంటల వరకు జె.మానస, హైదరాబాద్ వారిచే భరతనాట్యం, 9 గంటల నుండి 12 గంటల వరకు వి.శాంతకుమారి, శ్రీసాయి బాలాజి నాట్యమండలి, విజయవాడ వారిచే సత్యహరిశ్చంద్ర, మోహినీ విజయం పౌరాణికనాటక ప్రదర్శన, గ్రామోత్సవం ప్రారంభమైనప్పటి నుండి పలు బృందాలచే కోలాటాలు, చెక్కభజనలు, లంబాడి నృత్యాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు.

## కాణిపాకంలో సంకటహర చతుర్థి వ్రతం రద్దు

కాణిపాకం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:
కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి ఆలయంలో ప్రతినెలా జరిగే సంకటహర చతుర్థివ్రతంను ఈనెల రద్దు చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రతి పౌర్ణమి అనంతరం చతుర్థి రోజున ఆలయంలో సంకటహర చతుర్థి రోజున ఈవ్రతంను ఆలయంలో నిర్వహిస్తుంటారు. అయితే ఆలయంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతుండడంతో ఈనెల 13న జరగాల్సిన సంకటహర వ్రతంను రద్దు చేసినట్లు వారు తెలిపారు.

# కాణిపాకంలో కొనసాగుతున్న భక్తుల రద్దీ



కాణిపాకం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి అలయం ఆదివారం కూడా భారీగా తరలి వచ్చిన భక్తజనంతో పోటెత్తింది. సాధారణంగా వారాంతపు రోజుల్లో ఆలయంలో తీవ్ర స్థాయిలో భక్తుల రద్దీ వుంటుంది. ఈమేరకు శని, ఆదివారాలు ప్రభుత్వ సెలవు దినంలు కావడంతో ఆలయ దర్శనార్థం వివిధ ప్రాంతాలనుండి భక్తులు భారీ ఎత్తున తరలి వచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి కూడా భక్తులు స్వామివారికి మొక్కుబడులు తీర్చుకునేందుకు కాణిపాకం ఆలయానికి పెద్దఎత్తున తరలివచ్చారు. కాణిపాకం దేవస్థానంలో ప్రధాన ఆలయం కుంభాభిషేకం పూర్తయి స్వామివారి మూలవిరాట్ దర్శనం కల్పిస్తుండడంతో పాటు ఆలయంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతుండడంతో ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. దీనికి తోడు తిరుమల వెళ్ళే భక్తులు కూడా పెద్దఎత్తున కాణిపాకం ఆలయ దర్శనానికి వస్తుండడంతో ఉదయం నుండి రాత్రి వరకు భక్తజన సందోహంతో కాణిపాకం ఆలయం కిక్కిరిసింది. ఆలయంలోపుల క్యూలైను ,, సర్వదర్శనం కంపార్ట్‌మెంట్ పూర్తిగా నిండిపోవడంతో బయట క్యూలైన్లలో వేచివుండాల్సిన పరిస్థితి ఏర్పడింది. రద్ధీ కారణంగా స్వామి దర్శనంకోసం గంటల తరబడి క్యూలైన్లలో భక్తులు వేచివుండాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే స్వామివారి ప్రసాదం లడ్డూ పోటు వద్ద కూడా భక్తులు గంటల తరబడి వేచివుండడంతో క్యూలైన్లన్ని కిక్కిరిసింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు.


## నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



కాణిపాకం, ఆగస్టు 4 ప్రభాతవార్త:
కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు శనివారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు కుప్పంకు చెందిన దాశరథి, పద్మావతి దంపతులు అనే భక్తులు ఈమొత్తాన్ని విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని కుటుంబసభ్యులతో కలసి ఆలయ ఈఓ ఎంవి.సురేష్‌బాబుకు అందజేశారు. దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపరెంటెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### హరహర నామస్మరణలతో
# మార్మోగిన మల్లాం పురవీధులు

**- వైభవంగా శ్రీవళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి రథోత్సవం**
**- వేలాదిగా తరలి వచ్చిన భక్తులు**



చిట్టమూరు, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త
మల్లాం గ్రామంలో స్వయంభుగా వెలసిన శ్రీవళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం 7 గంటల నుంచే ఆంధ్రా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున స్వామివారి రథోత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ముందస్తు చర్యలు చేపట్టింది. మల్లాం పురవీధుల్లో స్వామి అమ్మవార్ల భారీ రథాన్ని లాగేందుకు పలువురు భక్తులు పోటీపడ్డారు. ముఖ్యంగా రథోత్సవం నాడు స్వామి అమ్మవార్ల పూజలో ఉన్న మిరియాలను చల్లుకోవడం ద్వారా పులిపిర్లతో పాటు పలు రోగాలు నయం అవుతాయన్న విశ్వాసంతో భక్తులు బారులు తీరారు. మల్లాంలో సుమారు మూడువేల కొబ్బరికాయల వరకు కొల్లు టెంకాయలుగా కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ కమిటీ ఛైర్మన్ చిల్లకూరు సాయికుమార్‌రెడ్డి ప్రత్యేక చలివేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు భక్తులకు మజ్జిలను సమకూర్చారు. బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా స్థానిక ఎస్ఐ గోపి సిబ్బందితో కలిసి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

## 26 నుండి అమ్మవారి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు

తిరుచానూరు, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:



తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారి ఆలయంలో ఈనెల 26 నుండి అక్టోబర్ 5వ తేదీ వరకు నవరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా ప్రతి రోజు ఆలయంలోని శ్రీకృష్ణ స్వామి ముఖ మండపంలో అమ్మవారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహిస్తారు. ఆఖరి రోజైన 5వ తేదీ విజయదశమి నాడు విశేషమైన గజవాహనంపై అమ్మవారు ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. నవరాత్రి ఉత్సవాల కారణంగా ఆ 10 రోజుల పాటు కళ్యాణోత్సవం, సహస్ర దీపాలంకరణ, 30వ తేదీ లక్ష్మీపూజ, అక్టోబర్ 5వ తేదీ అష్టోత్తర శత కలశాభిషేకం సేవలను రద్దుచేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## ఆధ్యాత్మిక చింతన కలిగివుండాలి
### ప్రతాప్ స్వామీజీ



రామచంద్రాపురం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:
ప్రజలు ఆధ్యాత్మిక చింతన కలిగివుండాలని ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామీజీ అన్నారు. రాయలచెరువు కట్ట క్రింద వెలసియున్న శ్రీ భవానీశంకర ఆలయ ఆవరణలో దశర ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక కళ్యాణార్థం దశర ఉత్సవాలను గ్రామీణ ప్రాంతాలలో నిర్వహిస్తున్నామన్నారు. మండలంలోని ప్రతి పంచాయతీలో అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో ఊరేగించనున్నట్లు తెలిపారు. భక్తులు దేవీ నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏకవీర సేవా ఫౌండేషన్ సభ్యులు ప్రవీణ్, తదితరుల పాల్గొన్నారు.

## జగనన్న పాలనలో రాష్ట్రం సుభిక్షం
### - తిరుమలకు పేర్నాటి దంపతుల పాదయాత్ర

కోట, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త



జగనన్న పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్‌పర్సన్ పేర్నాటి హేమ సుష్మిత, తూర్పు రాయలసీమ పట్టభద్రుల వైసీపీ ఎంఎల్‌సీ అభ్యర్థి పేర్నాటి శ్యాం ప్రసాద్‌రెడ్డిలు అన్నారు. వారు నెల్లూరు నుంచి తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజు బాగుంటే దేశం బాగుంటుందనే నినాదం మన జగనన్న పాలన చూస్తేనే అర్థమవుతుందని చెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో రాష్ట్రంలోని రైతులు సుభిక్షంగా జీవిస్తున్నారని చెప్పారు. రాబోయే రోజుల్లో కూడా జగనన్న పాలనలో ఇలాగే కొనసాగాలని కోరుతూ తిరుమలకు పాదయాత్ర చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు అందిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు.

## చిత్రరంగానికి మకుటంలేని మారాజు రెబల్‌స్టార్ కృష్ణంరాజు



తిరుపతి, సెప్టెంబర్ 11ప్రభాతవార్త:
తెలుగుచిత్రరంగంలో మకుటంలేని మారాజుగా రెబల్‌స్టార్ కృష్ణంరాజు వ్యవహరించారని, ఆయన నటీనటులతో అందరినీ కలసి కుటుంబంలా పనిచేశారని రాయలసీమ రంగస్థలి కళాసంస్థ ఛైర్మన్ గుండాలగోపీనాథరెడ్డి పేర్కొన్నారు. చిత్రనటుడుగాగాక కేంద్రమంత్రిగా కూడా ప్రజల్లో ఆయన తన స్థానం నిలుపుకున్నారని అన్నారు. కృష్ణంరాజు ఆదివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడవడంతో రంగస్థలి ఆధ్వర్యంలో కార్యాలయంలో ఆయన చిత్రపటాన్ని ఉంచి పుష్పాంజలి ఘటించారు. కృష్ణంరాజు నటించిన చిత్రాల్లో పురాణ ఆధ్యాత్మిక చిత్రం భక్తకన్నప్పలో కన్నప్పగా ప్రేక్షకులను అలరించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలి కళాకారులు కెఎన్ రాజ, అక్కినపల్లి మునికృష్ణయ్యయాదవ్, టి.సుబ్రమణ్యంరెడ్డి, పొన్నాలజేజిరెడ్డి, చెంగారెడ్డి కృష్ణంరాజుకు నివాళులర్పించారు.

## ముగిసిన ఇండియన్ అకాడమీ న్యూరో, ఫిజియాలజీ కాన్ఫరెన్స్-2022

తిరుపతి నగరం, సెప్టెంబరు 11 ప్రభాతవార్త :



స్విమ్స్ ఆధ్వర్యంలో మూడు రోజులు నిర్వహించిన ఇండియన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ ఐదవ జాతీయ క్లినికల్ న్యూరో ఫిజియాలజీ కాన్ఫరెన్స్-2022 ఆదివారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ బి. వెంగమ్మ, ప్రముఖ న్యూరో, ఫిజియాలజీ డాక్టర్లు, పలువురు వారి అభిప్రాయాలను తెలియజేశారు. ఇలాంటి కాన్ఫరెన్స్‌ల వలన డాక్టర్లల్లో నూతనోత్సవం వస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు డాక్టర్లను డాక్టర్ బి. వెంగమ్మ అభినందించారు.

## కనిపించే దేవుళ్ళు డాక్టర్లు



**వైద్యశిబిరం అనంతరం వైద్యులను సత్కరిస్తున్న ఎంఎల్‌ఏ**

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త
బాధితులకు కనిపించే దేవుళ్ళు డాక్టర్లని శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి అన్నారు. తిరుపతిలోని వెంకటరమణ, మెటర్నరీ ఆసుపత్రి 16వ వార్షికోత్సవం సందర్భంగా శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు.పట్టణంలోని కొత్తపేట జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో వైద్యశిబిరం ఏర్పాటు చేసారు. ముఖ్యఅతిదిగా శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి విచ్చేసారు.ఆయన రావటంతోనే ఓ వైపు డాక్టర్లతో ఇక్కడ అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. తరువాత తిరుపతిలోని గుండె ఆసుపత్రిలో అందిస్తున్న సేవలను ఎంఎల్ఏ వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు కనిపించేదేవుళ్ళు డాక్టర్లు అని వివరిస్తూ వెంకటరమణ ఆసుపత్రి నిర్వహిస్తున్న ఉచిత వైద్యశిబిరాలకు జనం నుంచి విశేష స్పందన వస్తుందన్నారు. తిరుపతి జిల్లాకు వెంకటరమ ఆసుపత్రి ఓ వరమని అభినందించారు. ఈ శిబిరంలో డాక్టర్ వెంకటరమణ,డాక్టర్ నిరుపమలు ఇక్కడకు వచ్చి పేదలకు ఉచితంగా వైద్యం అందించటం హర్షించదగ్గ విషయం అని ఎంఎల్ఏ వివరించారు.ఈ కార్యక్రమాల్లో డివైయస్‌పి విశ్వనాథం, పట్టణ పార్టీ అధ్యక్షుడు పగడాల రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్లు శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డిని దుశ్శాలువతో సత్కరించారు. స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని అందించారు.

## బిసిల కుల గణన కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వినతి




**జంగా కృష్ణమూర్తికి పుష్పగుచ్ఛం అందించి సన్మానిస్తున్న దృశ్యం**

తిరుపతి (క్రీడా), సెప్టెంబర్ 11,ప్రభాతవార్త
రాష్ట్ర శాసనమండలిలో విప్‌గా వ్యవహరిస్తున్న శాసనమండలి సభ్యులు, సీనియర్ నాయకులు జంగా కృష్ణమూర్తిని తిరుపతి జిల్లా కేంద్రంలోని శ్రీ పద్మావతి అతిథి భవనంలో తిరుపతి నగర బిసి ఐక్యవేదిక నాయకులు కలిసి బిసిలు సమస్యల పైన చర్చించి బిసిల కుల గణన కోసంచర్యలు చేపట్టాలని వినతి పత్రం సమర్పించారు. దేశంలోతమిళనాడు, బీహార్ ఇలా చాలా రాష్ట్రాలు స్వచ్ఛంధంగా బిసిల కుల గణన కోసం చర్యలు చేపట్టి ఉన్నారని అదే విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా బిసిల కులగనలను చేపట్టి బిసిలు లెక్కలు తేల్చుటకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో బిసి ఐక్యవేదిక నాయకులు టి. గోపాల్, లక్ష్మయ్య, బివి కేశవులు, వాసు యాదవ్, అక్కిపల్లి లక్ష్మయ్య, జయరాం, గుణశేఖర్, జల్లి మధుసూదన్, దేవరాజులు, పాపయ్య కన్నెమడుగు మల్లికార్జున్, బిసి విద్యార్థి నాయకులు మురళి, విజయ్, గోపి, మధు తదితరులు పాల్గొన్నారు.

### గంజాయి అక్రమ రవాణాపై
# పోలీసుల ఉక్కుపాదం
న కడపకు చెందిన వ్యక్తి అరెస్టు



రేణిగుంట, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:
గంజాయి అక్రమ రవాణాపై తిరుపతి ఎస్పీ పరమేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ సుప్రజ(జాయింట్ డైరెక్టర్) సూచనలతో ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ స్వాతి పర్యవేక్షణలోపోలీసులు గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఈ క్రమంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ (సెబ్) అధికారులు రేణిగుంట పాత చెక్‌పోస్టు వద్ద శనివారం ఆకస్మికంగా దాడులు నిర్వహించి మార్కెట్‌లో లక్ష రూపాయల విలువ చేసే 9.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని కడప జిల్లా చెందిన వల్లూరు వెంకటేశ్వరరెడ్డి(30)ను అదుపులోకి తీసుకున్నారు. అధికారులు చెప్పిన సమాచారం మేరకు కడప జిల్లా కడప చిన్న చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెంకటేశ్వరరెడ్డి నర్సీపట్నంలో ఓ వ్యక్తి నుంచి 25 వేల రూపాయలకు 9.5కేజీల గంజాయిని కొన్నాడు. దీనిని అతను కడపకు తీసుకుపోవడానికి స్థానిక పాత చెక్‌పోస్టు వినాయకుని గుడి వద్ద వేచి ఉండగా అధికారులకు అందిన సమాచారం మేరకు సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ మార్కెట్‌లో లక్ష రూపాయల వరకు ఉంటుందని తెలిపారు. కేసు నమోదు చేసిన అధికారులు ముద్దాయిని రిమాండ్‌కు పంపారు. ఈ దాడుల్లో టాక్స్‌ఫోర్స్ సీఐ హేమంత్‌కుమార్, ఎస్ఐ నరసింహులు, తిరుపతి రూరల్ సీఐ ఫణింద్ర, ఎస్ఐ భాస్కర్, విజిలెన్స్ సీఐ పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. ప్రభుత్వం నిషేధిత మత్తు పదార్థాలను అమ్మినా, కొనినా, అమ్మడానికి ప్రోత్సహించైనా, అక్రమంగా తరలించినా, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు కఠినంగా ఉంటాయని అధికారులు హెచ్చరించారు.



# ఆ "ఒక్కడు" !
## టిడిపి నగర పార్టీలో పెత్తనం!!

ప్రభాతవార్త-తిరుపతి:
ఓ వైపు తెలుగుదేశం అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు పార్టీని బలోపేతం చేసుకుంటూ, కుటుంబ సభ్యులతో సమానమైన పార్టీనేతలు అందరూ సమన్వయంగా పనిచేయాలని హితవు చేస్తున్నా తిరుపతి తెలుగుదేశం పార్టీలో ఆ ఒక్కడి తో వేగలేకపోతున్నామని పార్టీ శ్రేణులు బాహాటంగానే ఆవేదన వెళ్ళగక్కుతున్నారు. నగరపార్టీలో ఆ ఒక్కడు వ్యవహారంతో కొందరు సీనియర్లు కూడా అసహనం వ్యక్తం చేస్తుండటం ఇందుకు నిదర్శనం. పదవి రాకముందూ అందరూ తనకు ఆత్మీయులని ప్రగల్భాలు పలికిన ఆ నాయకుడు పదవి దక్కించుకున్నాక తన మాటే వేదమంటూ, తాను చెప్పినట్లే పార్టీలో ఉండాలని నేతలను హడలెత్తిస్తున్నారని గోడువెల్లగక్కుతున్నారు. ఆ ఒక్కడి వాలకంతో ఇప్పటికే మహిళ కమిటీ కూడా దూరమైందనే చర్చ మొదలైంది. పార్టీలో పదవులు వస్తుంటాయి, పోతుంటాయని, ఒక కుటుంబంలా మెలగాల్సిన నాయకులపై పెత్తనం చలాయిస్తున్నాడని ఆవేదన చెందుతున్నారు. నగరకమిటీలో ఆయన పనితీరు ఏ పాటిదో ఏకంగా ఇన్‌ఛార్జికి ,రాష్ట్రనేతలకు తెలిసినా చేజేతులా చేసుకున్న తప్పిదాలకు కిక్కుమనకుండా ఉంటున్నారని పార్టీలో లుకలుకలు సాగుతున్నాయి. తిరుపతి నియెజకవర్గం టిడిపికి కంచుకోట. పార్టీ అభిమానులు, అధినేత సామాజికవర్గం నేతలతోబాటు యాదవ, బలిజ, రెడ్డి వర్గీయులు కూడా చెక్కుచెదరని ఓటర్లు ఉన్నారు. ఇప్పటికే తిరుపతిలో పార్టీ సభ్యత్వ నమోదులో వెనుకబడిన కారణం కూడా ఆ ఒక్కడితో ఇమడలేకనే అంటున్నారు. తిరుపతి నియోజకవర్గంలో దాదాపు 3లక్షల వరకు ఓటర్లు ఉంటే ఇందులో తెలుగుదేశం అభిమానులు 1.50లక్షలమంది వరకు ఉంటున్నారు. అయితే కనీసం 10వేలు కూడా ఇప్పటికీ సభ్యత్వనమోదు చేయించలేక పార్టీనేతలు వైఫల్యం చెందారంటే ఆ ఒక్కడి వల్లనేననే విమర్శలు లేకపోలేదు. పార్టీలో మూడు,నాలుగు దశాబ్దాలు సీనియార్టీ,పార్టీ కోసం తపన పడే నాయకులను కూడా ఆయన ఖాతరుచేయడంలేదనేది బహిరంగ విమర్శలు. తన సామాజిక వర్గం నేతల్లో కూడా ఆ ఒక్కడి వ్యవహారంపై గుర్రుమంటున్నారు. అందరినీ కలుపుకెళ్ళాల్సిన ఆయన తన మాటే వేదంగా సాగాలనే తీరుగా ఉన్నాడని అంటున్నారు. ఇలాగే ఉంటే నగరకమిటీలో సీనియర్లు కూడా పార్టీకి దూరమయ్యే ప్రమాదం ఉందనే చర్చ జరుగుతోంది.

అనవసరవాటికి ఆ ఒక్కడే పెత్తనం చేయాలని చూస్తుంటాడని, ఆయనతో వేగలేకపోతున్నామని బహిరంగంగా వ్యాఖ్యలు లేకపోలేదు. పార్టీ ముఖ్యమని పార్టీని కాపాడుకుంటారా లేక ఆ ఒక్కడే అవసరమని నేతలు చూస్తూ కార్యకర్తలు, ద్వితీయశ్రేణి నాయకులను వదలుకుంటారా?అనేది కార్యకర్తల్లో హాట్‌టాఫిక్‌గా మారింది.